www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 13 జూన్ 2025

5



రెండో రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - మండపేట

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె గురువారం 20వ రోజుకు చేరింది. మండపేట పురపాలక సంఘం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం లో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన తో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వం జీతాలు పెంచి ఆదుకోవాలన్నారు. ఏళ్ల తరబడి సమస్యలతో సతమతమవుతున్న తమను ప్రభుత్వం అన్ని విధాల గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కప్పల అన్నవరం, పిట్టా ప్రవీణ కుమార్, సైనం భాస్కరరావు,మందపాటి గన్నియ్య,వెంకటేశ్వర్లు, తలాటి వెంకన్న ,వాసంశెట్టి వాసు,వాసంశెట్టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


అర్ధనగ్న ప్రదర్శనతో కార్మికుల నిరసన

నత్తనడకన ఫ్లయ్ ఓవర్ నిర్మాణం

- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- కనీసం సర్వీస్ రోడ్లకూ నోచుకుని వైనం
- ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు
- పట్టించుకోని హైవే అధికారులు

ప్రజాశక్తి - ఆలమూరు

216ఎ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు, తద్వారా ప్రయాణికుల ఇబ్బందుల పరిష్కారానికి అధికారులు పలుచోట్ల ఫ్లయ్ ఓవర్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మోరంపూడి వద్ద, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని జొన్నాడ వద్ద ఫ్లయ్ ఓవర్ల నిర్మాణానికి 2023 జనవరిలో కేంద్రమంత్రి నితిన్ గట్కరి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 2024 జనవరికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ప్రకటించారు. ఈ రెండింటిలో మోరంపూడి వద్ద పనులు శరవేగంగా జరిగి ఫ్లయ్ ఓవర్ నిర్మాణం అనుకున్న సమయానికి మూడు నెలల ఆలస్యంగానైనా పూర్తి చేసి ప్రారంభించారు. కానీ ఆలమూరు మండలంలోని జొన్నాడ వద్ద ఫ్లయ్ ఓవర్ పనులు ప్రారంభించినప్పటికీ, గుత్తేదారు అలసత్వంతో నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండు ఫ్లయ్ ఓవర్ల వద్ద పనులు బేరీజు వేసుకుంటే మోరంపూడి వద్ద పనులు పూర్తి చేశారు. కానీ జొన్నాడ వద్ద 2024 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నిర్మాణ పనులు పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుత పరిస్థితి చూసుకుంటే ఇంకా పిల్లర్ల దశే పూర్తికాని దుస్థితి నెలకొంది. ఈ జొన్నాడ ఫ్లయ్ ఓవర్ పై ఎందుకంత వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదని స్థానికులు ప్రజా ప్రతినిధులను, అధికారులను బాహాటంగా విమర్శిస్తున్నారు. ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనుల జాప్యంతో గడిచిన రెండున్నర ఏళ్లగా జొన్నాడ సెంటర్ వద్ద ప్రమాదాలకు నిలయంగా మారింది. ఫ్లయ్ ఓవర్ పనుల పేరుతో ఎటువంటి నియమ, నిబంధనలు పాటించకుండా వదిలేయడంతో తరచు అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పలువురు మృత్యువాత పడగా, అనేకమంది క్షతగాత్రులుగా మిగులుతున్నారు. అయినప్పటికీ హైవే అధికారులు నిర్లక్ష్య ధోరణిలో ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. డివైడర్ దాటే క్రమంలో రోడ్డు ఒక పక్క నుంచి మరొక పక్కకు వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక పిల్లర్ల నిర్మాణానికి రెండున్నర ఏళ్లు పట్టిందంటే మిగిలిన పనులు ఎంత నత్తనడకన సాగనున్నాయో అర్థం చేసుకోవచ్చునని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలమూరు మండలంలోని అనేక ప్రాంతాలకు వెళ్లే వారికి జొన్నాడ సెంటర్ ముఖ్య కూడలిగా నడుస్తోంది. నిత్యం వందలాదిమంది ఇక్కడకు చేరుకొని రాజమహేంద్రవరం, విజయవాడ తదితర దూర ప్రాంతాలకు ప్రయాణిస్తూ ఉంటారు. సర్వీస్ రోడ్ల పేర్లతో ఉన్న బస్సు షెల్టర్లను తొలగించారు. ఇంతవరకు సరైన సర్వీస్ రోడ్డు కానీ, కనీసం ప్రయాణికులకు బస్సు షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ రెండున్నర ఏళ్లగా ప్రయాణికులు ఎండకు ఎండి, వానకు తడిసి బస్సుల కోసం రోడ్డు మీదే నిరీక్షించాల్సి వస్తోంది. ఇక సర్వీసు రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులతో బస్సులను ఎక్కడ ఆపుతున్నారో ప్రయాణికులకు అర్థం కావడం లేదు. దీంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. జొన్నాడ సెంటర్ వద్ద పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే హైవే అధికారులు చోద్యం చూస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


జొన్నాడ సెంటర్ ఫ్లయ్ ఓవర్ పిల్లర్ల దశ పూర్తికాని దుస్థితి (ఇన్‌సెట్)లో దక్షిణం వైపు అప్రోచ్ రోడ్డు ఇలా..


ఫ్లయ్ ఓవర్ కు ఉత్తరం వైపు అప్రోచ్ రోడ్డు దుస్థితి

సర్వీస్ రోడ్లు పటిష్టంగా నిర్మించాలి



తూతూ మంత్రంగా సర్వీస్ రోడ్లను గుత్తేదారు నిర్మించి ఇవ్వడంతో అవి వెను వెంటనే శిథిలం కావడంతో పలు ప్రమాదాలకు దారితీస్తోంది. ఇంత జరుగుతున్నా హైవే అధికారులు పట్టనట్టు వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటికైనా స్పందించి సర్వీసు రోడ్లు పటి ష్టంగా నిర్మించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలి.

-ఈదల సత్తిబాబు ,టిడిపి మండల అధ్యక్షుడు , ఆలమూరు

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



అనునిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే జొన్నాడ సెంటర్ వద్ద ఫ్లయ్ ఓవర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మా తోటి ప్రయాణికులు ఇప్పటికే పలువురు ప్రమా దాల బారిన పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన ఫ్లయ్ ఓవర్ నిర్మాణం పూర్తి చేయాలి.

-రాయుడు వెంకటేష్ , చెముడులంక, ప్రయాణికుడు

నియంత్రణ లేని ట్రాఫిక్‌తో అవస్థలు



జొన్నాడ సెంటర్ వద్ద ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు సరైనసూచికలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత గుత్తేదారుతో సమీక్ష నిర్వహించి, పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల అవస్థకు అడ్డుకట్ట వేయాలి. హైవే అధికారులుస్పందించి ఫ్లయ్ఓవర్ నిర్మాణాన్ని వేగవంతంగా చేయాలి.

-దూలం రాంబాబు , బడుగు వాణి లంక , ప్రయాణికుడు

మిడ్డే మీల్స్‌కు సన్నబియ్యం అందజేత


ప్రారంభిస్తున జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉదయభాస్కర్

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం అత్యం త ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం పథకాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ స్థానిక పట్టణంలోని జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. డిప్యూటీ ఇఒ, ప్రధానోపాధ్యాయులు ఇతర బోధన సిబ్బంది హాజరైన ఈ కార్యక్రమం లో కూలీ పనులకు వెళ్లే వారి పిల్లల ఆరోగ్యాన్ని దృష్టి లో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన పోషకాహార భోజనాన్ని అందిస్తుందన్నారు. అయితే ఆ భోజనంలో బియ్యం నాణ్యత సరిగా లేక ఎక్కువ మంది భోజనం చేయడం లేదని ప్రభు త్వం గుర్తించిందన్నారు. దీనికి పరిష్కారంగా సన్న బియ్యం సరఫరా ద్వారా మధ్యాహ్న భోజనం అంది ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు సంక్షేమ హాస్టళ్లు వెరసి 1534 ప్రభుత్వ పాఠశాలలు, 62 సంక్షేమ హాస్టల్లో 9694 ప్యాకెట్లు ఒక ప్యాకెట్ కి 25 కిలోల చొప్పున అందజేస్తామన్నారు. ఇప్పుడు నాణ్య మైన సన్న బియ్యం తో పెడుతున్నం దువల్ల విద్యార్థులంతా కచ్చితంగా స్కూల్లోనే భోజనం చేయాలన్నారు ప్రభుత్వం సమతుల్య పోషకాహారంగా అంది స్తున్న ఆహారపు యొక్క ప్రయోజనాలను విద్యా ర్థులందరూ అందుకోవాలని ఈ సందర్భంగా డిఎస్ఒ కోరారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కూడా పిల్లలకి స్కూల్లో అందించే నాణ్యమైన ఆహారం రాగిజావ, చిక్కి ఇటువంటివన్నీ ఎంతో ఉపయోగకరమని బోధించి పదార్థాలన్నీ స్వీక రించేలాగా చేయాలని చెప్పారు. డిప్యూటీ ఇఒ, ప్రధానోపాధ్యా యులు ఈ కార్యక్రమాన్ని పూర్తిగా విజయవంతం చేయాలని చేస్తామని పిల్లలకు సరైన విధంగా మార్గదర్శ కత్వం వహించి నూటికి నూరు శాతం పిల్లలు సంతృప్తిగా ఆరగించేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు.

ఆలమూరు ఎస్‌టిఒగా సుజాత బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సుజాత

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక ఉప ఖజానా అధికారిగా వి.సుజాత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రాజమహేంద్రవరం ఎస్‌టిఒ గా ఆమె విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌టిఒ హైదర్ అలీ చింతూరు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌టిఒ సుజాత మాట్లాడుతూ తన పరిధిలో ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు విధులు సక్రమంగా నిర్వహిస్తూ పరిపూర్ణమైన సేవలు అందిస్తామన్నారు. దీర్ఘకాలిక సమస్యలు ఉంటే ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయ కులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, పెన్షనర్స్ సంఘ నేతలు ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతులంతా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల వ్యాప్తంగా ఉన్న రైతులందరూ ఈనెల 20వ తేదీ లోపు బయోమెట్రిక్ ద్వారా ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.ప్రవీణ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.ఐదు వేలు, పిఎం కిసాన్ పథకం ద్వారా రూ.2000 రైతుల అకౌంట్లో జమ చేస్తారన్నారు. అర్హులైన రైతులందరూ రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఇకెవైసి చేయించుకోవాలన్నారు. రైతులందరూ ఆధార్ కార్డు తీసుకుని సమీపంలోని రైతుసేవ కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ ద్వారా ఇకెవైసి పూర్తి చేయాలన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మలేరియా నిర్మూలనపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఐ.పోలవరం

కేశనకుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తిళ్లకుప్ప గ్రామ పంచాయతీ వద్ద సెక్రటరీ ఆర్.స్వాంబాబు పర్యవేక్షణలో సర్పంచ్ కడియం తమ్మయ్య సమక్షంలో ప్రపంచ మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మలేరియా నిర్మూలనపై అవగాహనా ర్యాలీ గురువారం నిర్వహించారు. తమ్మయ్య మాట్లాడుతూ మలేరియా నిర్మూలన దిశగా పురోగతిని వేగవంతంగా కృషి చేయాలని అన్నారు. ఎంపిహెచ్ఇఒ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. పురవీధుల్లో దోమలను నిర్మూలిద్దాం, దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారిద్దాం. మలేరియా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ పురవీధుల్లో నినాదాలు చేసుకొంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట కృష్ణ సతీష్ నాయుడు, హెల్త్ సూపవైజర్ కె.రమేష్, ఎం.సూర్యకుమారి, ఎంఎల్‌హెచ్‌పి సాయి వినూత, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


తిళ్లకుప్పలో ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది, సర్పంచ్ తదితరులు

మున్సిపల్ హైస్కూల్‌లో విద్యా మిత్ర కిట్ల పంపిణీ


విద్యామిత్ర కిట్స్ అందచేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ నూకదుర్గారాణి

ప్రజాశక్తి - మండపేట

పట్టణం ఎస్ఎస్‌వివి మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్స్ పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,బ్యాగ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అదే పాఠశాలలో విద్యార్థులకు 6సంవత్సరాల పాటు విశేష సేవలు అందిచి బదిలీపై వెళుతున్న ప్రధానోపాధ్యాయులు పివివిఎల్ఎన్.మూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్, పాఠశాల ఎస్ఎంఎసి ఛైర్మన్ ఇల్లూరి కామేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం ఎం కెపి.వాణి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె సత్తిబాబు, వైసిపి నాయకులు యరమాటి వెంకన్నబాబు, పేరూరి మాధవి, పీనెడ్డి కృపావతి, కొమ్మోజు నాగేశ్వరరావు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలను పరామర్శించిన ఛైర్‌పర్సన్ రాణి

మండపేట పట్టణం 20వ వార్డు వైస్సార్ కాలనిలో ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి కార్యకర్త మోర్తా శ్యామ్ ను గురువారం మున్సిపల్ ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి వారి స్వగహానికి వెళ్లి పరామర్శించారు.అ దే వార్డులో ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద కోలుకుంటున్న వైసిపి కార్యకర్త బత్తిన దొరబాబు కుమార్తెను పలకరించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్, వైసిపి నాయకులు యరమాటి వెంకన్నబాబు, పేరూరి మాధవి, పీనెడ్డి కృపావతి, కొమ్మోజు నాగేశ్వరరావు తదితరులు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందించాలి


అంగన్‌వాడీ సెంటర్లకు ఎలక్ట్రికల్ స్టౌలు, కుక్కర్లు అందజేస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సరైన పౌష్టికాహారాన్ని అందించాలని ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం కార్యాలయంలో గల అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన ఎలక్ట్రికల్ కుక్కర్లు, ఎలక్ట్రికల్ స్టౌవ్‌లను మంత్రి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి అక్షర అభ్యాసం నుండి విద్యార్థులకు అవసరమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం సంక్షేమ ఆరోగ్య కార్యక్రమాలు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం లో మండల పరిషత్ అధ్యక్షురాలు అంబటి భవాని , జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సిడిపిఒ వరలక్ష్మి, ఎంపిడిఒ పద్మ జ్యోతి, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, కూటమి నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్లు ప్రారంభించిన మంత్రి సుభాష్

నియోజవర్గంలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో మంచినీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటుచేసిన రెండు ట్యాంకర్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలో వేసవి నీటి ఎద్దడి దృష్ట్యా తక్షణమే నీటి సరఫరా చేసేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుంచి రెండు మంచినీటి సరఫరా ట్యాంకర్లను అందుబాటులో తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమం కోసం సిఎస్ఆర్ నిధులు వెచ్చించిన ఠాగూర్ లేబరేటరీస్ ప్రయివేటు లిమిటెడ్, లీ ఫార్మల్ లిమిటెడ్ సంస్థలను మంత్రి సుభాష్ అభినందించారు. అనంతరం వాటర్ ట్యాంకర్‌ను కె.గంగవరం మండలం కోట గ్రామానికి మంచినీరు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఏడాదిలో రూ.125 కోట్లతో అభివృద్ధి పనులు

ఏడాది పాలనపై మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజవర్గంలో ఏడాదిలో రూ.125 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏడాది కూటమిపాలన అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగిందని అన్నారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకొని కూటమి ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తుందన్నారు. ద్రాక్షారామంలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం కోసం రూ.11.5 కోట్లు, వెల్ల గ్రామం వద్ద సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.3.3 కోట్లు, రామచంద్రపురం డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు, నాబార్డు ద్వారా మేజర్ కనెక్టింగ్ రోడ్లు రూ.9 కోట్లు, ఆర్అండ్‌బి ద్వారా గుంతల రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్లు, గొల్లపాలెం - కుయ్యేరు రోడ్డుకు రూ.32 కోట్లు, రామచంద్రపురం పురపాలక సంఘం ద్వారా అభివృద్ధి పనులు 16.19 కోట్లు, ఎంపీ లాడ్స్ ద్వారా రూ.60 లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.19.35 కోట్లు, సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ 17.22 కోట్లు, పిఎం కిసాన్ ద్వారా రూ.3 కోట్లు, అంగన్‌వాడీ నిధులు రూ.4 కోట్లు, ఇరిగేషన్ పనుల కోసం రూ.8 కోట్లు, సిఎం సహాయ నిధి ద్వారా రూ.90 లక్షలు, పశుసంవర్ధక ద్వారా రూ.2.5 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేపట్టమన్నారు. ప్రభుత్వ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా మహిళలకు, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. 30 జాబ్ మేళాలు నిర్వహించామన్నారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా రామచంద్రపురంలో ఒక ఆసుపత్రి నిర్మించి అన్ని రకాల వైద్య సేవలు, భవనం నిర్మించేందుకు కషి చేస్తున్నామన్నారు. అలాగే 4 ఫ్రీజర్ బాక్సులు, 2 వాటర్ ట్యాంకులు సమకూర్చామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తున్నామన్నారు. డూప్లికేషన్ పేరుతో ఆపిన పథకాలు మళ్లీ పునరుద్ధరించి అమలు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో కొత్తగా ఏడు ఇఎస్ఐ ఆసుపత్రులు నిర్మిస్తున్నామన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1500, 45 ఏళ్ల మహిళలకు రూ.18000 వంటి హామీలపై మంత్రిని ప్రశ్నించగా ఓటమి అధికారంలోకి వచ్చేసరికి ఖజానా ఖాళీ అయిందని నిధులు కొలత వల్ల హామీలు అమలు ఆలస్యం అవుతుందని ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తామని ఆయన వివరించారు.

కార్టూన్'నిజం'



స్వయం కృషి సంఘ రిజిస్ట్రేషన్ పత్రం ఆవిష్కరణ


పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ ఎ.రాజు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధిలో 18 గ్రామాల స్వయం కృషి పెయింటర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు గురువారం ఆవిష్కరించి యూనియన్ కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజు మాట్లాడుతూ స్వశక్తిని నమ్ముకుని పనిచేసే ప్రతి ఒక్కరు ఉన్నత స్థానాన్ని అధిరోహిస్తారన్నారు. అలాగే యూనియన్ లేబర్ కార్డు వల్ల ప్రభుత్వము నుంచి అనేక రాయితీలు పొందవచ్చన్నారు. ఇందుకు పోస్ట్ ఆఫీస్ లో రూ.750 సబ్సిడీ డిపాజిట్ చేస్తే దాని ద్వారా ఇన్సూరెన్స్, లోన్స్, బిల్డింగ్ సెంట్రింగ్, స్ప్రే మోటార్స్ ఇలా అనేక రకాల ప్రభుత్వ రాయితీలు ఉన్నాయని ఆయన తెలిపారు. అయితే ప్రతి దానికి మీరు కార్డు ద్వారా ఆన్లైన్ చేయించుకుంటూ ఉండాలని యూనియన్ సభ్యుల సౌకర్యం కోసం మా వంతు సహకారం అందిస్తామన్నారు. అవసరమైతే లేబర్ అధికారిని రాయితీలు వివరించటం కోసం మీ అందరికీ ఒక సభగా ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాంటి అవగాహనా సదస్సుల ద్వారా ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి సువర్ణ అవకాశాన్ని పొందే విధానాన్ని తెలుసుకోవచ్చుని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ర్యాలీ సాంబయ్య, ఉపాధ్యక్షుడు పెందుర్తి సురేష్, కార్యదర్శి సామ్యూల్, సహాయ కార్యదర్శి గంటా మధు, కోశాధికారి యార్లగడ్డ మనోహర్, సభ్యులు కుడేలు సూరిబాబు నరుకుర్తి శ్రీనివాస్, రేలంగి హేమంత్, నేతల నరేష్, బుంగ విజయ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - కాట్రేనికోన

ప్రభుత్వ పథకాలపై మహిళాలకు అధికారులు అవగాహన కల్పించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో విఒఎలకు సమీక్ష సమావేశాన్ని గురువారం డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయకుమార్, బ్యాంక్ లీకేజ్ డిపిఎం అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడం, కొబ్బరి తోటల్లో గడ్డి పెంపకం పాడి గేదెలు ఆవులు యూనిట్స్ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం తదితర పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. విఒఎలు మహిళల ద్వారా సహకరించిన నగదును బ్యాంకులో జమ చేయడంపైన, బ్యాంకు లీకేజ్ ఆన్లైన్ హెచ్ఎల్‌సి ఎంట్రీ విధానం గురించి వివరించారు. కార్యాలయంలో మహిళా సమాఖ్య సంఘ పనితీరును పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి డిజిఎం శ్యామల, ఎజిఎం హేమ హాజరై జీవనోపాధి కొరకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ లోన్స్ గురించి అలాగే వాటి రికవరీ కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్, డేటా ఎంట్రీ ఆపరేటర్ నాగార్జున, మండల మహిళా సమాఖ్య సంఘ నాయకులు, విఒఎలు పాల్గొన్నారు.


మండల మహిళా సమాఖ్య కార్యక్రమంలో సమీక్షా సమావేశం

వడ్లమూరులో సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండపేట ఐ.సిడియస్ ప్రాజెక్టు,పరిధి కపిలేశ్వరపురం మండలం, వడ్లమూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఐ.మాణిక్యం మాట్లాడుతు 3 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగనవాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అంగన్వాడిలో ఆట- పాటల ద్వారా అందిస్తున్న విద్య వలన పిల్లలతో సమగ్ర అభివద్ధి సాధించవచ్చునని తల్లులకు వివరించారు. శ్రమ స్వచ్ఛంద సంస్థ రమణయ్య మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలందరినీ తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అంగన్‌వాడీలో అందించే 9 అంశాలతో కూడిన ప్రీస్కూల్ విద్యను పిల్లలకు అందిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రమ స్వచ్ఛంద సంస్థ సభ్యులు దుర్గా రావు, రమణయ్య, భవాని, శారద, నాగరాజు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, చిన్నారులు, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ఆమె బంధువుపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన మహిళ పోసమ్మ గత నెల 31న తన ఇంటి సమీపంలోని చర్చిని శుభ్రం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బరకటి నాగేశ్వరరావు తన సెల్‌ఫోన్‌లో ఆమెను వీడియో తీశాడు. ఈ విషయమై వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వివాదాన్ని ఆపడానికి పోసమ్మ మేనకోడలు అక్కడికి రాగా, నాగేశ్వరరావు ఆమెపై దాడి చేశాడు. ఆమె దుస్తులను చించేశాడని బాధితులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

1,268 కేజీల బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రాజానగరం

స్థానిక జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 1,268 కేజీల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో అధికారులు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తణుకు నుంచి జగ్గంపేటకు బొలెరో వాహనంలో పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బియ్యాన్ని సీజ్ చేశారు. వీటి విలువ రూ.58,328 ఉంటుందన్నారు. ఎంఎస్ఒ ఐ.బాపిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోకవరం

పురుగు మందు తాగి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం...మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన సన్యాసి నాగేంద్రుడు (50) తన ఇంటి వద్ద గురువారం పురుగుల మందును తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబీకులు గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో భక్తాంజనేయ స్వామి స్నాన ఘట్టం సమీపంలో గోదావరి నదిలో గురువారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుని వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని, మృతుని వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదని పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. వివరాలు తెలిసినవారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో లేదా 9440796622 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని సుభద్రపాలెం గ్రామానికి చెందిన తిప్పనబోయిన శ్రీనివాసరావు(35) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గురువారం ఉదయం అదే గ్రామంలోని ఒక రైతు పొలంలో పామాయిల్ గెలలు కోసేందుకు కూలికి వెళ్లిన శ్రీనివాసరావు విద్యుత్ వైర్లకు కత్తి తగలంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లజర్ల పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మహిళలకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర శ్రేయస్సు, ప్రజాహితాన్ని దష్టిలో పెట్టుకుని దార్శనికుడు, అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐక్యంగా నవ్యాంధ్రను అభివద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'ఇగో' నాటకం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

తిరుమాలిలో నేరెళ్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ప్రదర్శించిన 'ఇగో' నాటకం ఆహూతులను ఆలోచింపజేసింది. సమాజంలో టీనేజర్స్ తీసుకునే అనాలోచిత నిర్ణయాల వల్ల ఆ కుటుంబాలు పడే ఆవేదనను నటీనటులు కళ్లకు కట్టినట్టు చూపించారు. ఈ నాటకం రచయిత, డైరెక్టర్ కట్ట వెంకటేశ్వరరావు (శ్రీను) మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు నాటకాలు, ఇతర కళా వ్యవస్థలు దోహదం చేస్తాయన్నారు. ముఖ్యంగా టీనేజర్స్ మాయమాటలకు లొంగి తెలిసీ తెలియని వయసులో చేసే తప్పులను ఇతివృత్తంగా తీసుకొని ఈ నాటకం రచించారని తెలిపారు. వెంకటేశ్వరరావును గ్రామ పెద్దలు సూతి వీరప్రభాకర్, చందువోలు రాజా, ఉత్సవ నిర్వాహకులు అభినందించారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఇంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. స్కూలు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా స్కూలు కమిటీ చైర్మన్ కాళ్ళ లక్ష్మణరావు, జనసేన నాయకులు గవర శ్రీరాములు, టిడిపి నాయకులు వాసంశెట్టి అంజిబాబు మాట్లాడారు. పాఠశాలలో భోజనం వండడం వల్ల విద్యార్థులు ఎక్కువమంది భోజనం చేస్తారని, దానివల్ల హాజరు శాతం మెరుగు పడుతుందన్నారు. మాజీ ఎంపిటిసి మాసుమేను గంగయ్య విద్యార్థులకు స్వీట్స్, పెరుగు పంపిణీ చేశారు.

బాల కార్మిక వ్యవస్థతో భవిష్యత్తు అంధకారం

ప్రజాశక్తి - అమలాపురం


ర్యాలీ నిర్వహిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

బాల కార్మికులుగా బాలలను కొనసాగిస్తే వారి భవిష్యత్తు అంధకారంలో ఉంటుందని, వారికి సరైన విద్య అందించకపోవడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయని ఐసిడిఎస్ సిడిపిఒ రమాదేవి అన్నారు. అలర్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అమలాపురంలోని మహిళా సమాఖ్య భవనం నందు అలర్ట్ కో-ఆర్డినేటర్ శీలా శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసిడిఎస్ సిడిపిఒ రమాదేవి మాట్లాడుతూ చిన్నవయసులోనే బాలలను పనిలో పెట్టుకోవడం వల్ల వారు శారీరకంగా, మానసికంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తద్వారా బాల్య వివాహాలకు ఆస్కారం అవుతుందని తెలియజేశారు. లేబర్ డిపార్ట్మెంట్ అధికారి మల్లేశ్వర్ మాట్లాడుతూ పిల్లల పనిలో ఉంటే గుర్తించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారిని పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తును వారికి ఇవ్వాల్సిన బాధ్యత మనకు ఉందనితెలియజేశారు అదేవిధంగా బాల్య వివాహాలపై మరియు బాల కార్మిక వ్యవస్థ పై జిల్లాలో పనిచేస్తున్న అలర్ట్ స్వచ్ఛంద సంస్థను పలువురు అధికారులు అభినందించారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ రూపుమాపుతాం,బాలలు పనిలో కాదు బడిలో ఉండాలి. అనే నినాదాలుతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిపిఒ విజయశ్రీ, డ్వాక్రా ఎపిఎం సత్యనారాయణ అంగన్‌వాడీ సూపర్వైజర్స్, వర్కర్స్, కిశోరి బాలికలు, లర్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలో డిజిటల్ గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి - మండపేట


ప్రారంభించిన ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

మండల కేంద్రమైన రాయవరం గ్రామంలో రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన డిజిటల్ గ్రంథాలయాన్ని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో భాగంగా శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను విద్యార్థులకు ఎంఎల్ఎ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాయవరం గ్రామ అభివద్ధి కమిటీ ఛైర్మన్, టిడిపి నాయకులు వుండవిల్లి రాంబాబు, వల్లూరు శ్రీనివాసు, కోట వెంకటరమణ, దంతంశెట్టి బాల, కామన్ సురేషు, నేతల సురేష్, ఇందుకమిల్లి అరుణ్ కుమార్, చల్లా సత్యనారాయణ, బర్ల రాజు, జిల్లా అదనపు పథక సమన్వయకర్త సమగ్ర శిక్ష జి.మమ్మీ, డివైఇఒ పత్తి రామలక్ష్మణుమూర్తి, ఎంఇఒ వై.సూర్యనారాయణ, ఏఎంఓ పి.రాంబాబు, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండపేట పురపాలక సంఘం పరిధిలో పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమానికి పుర పాలక సంఘం ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండపేట పురపాలక సంఘ పరిధిలో 15 నుండి 22 వార్డులల్లో బిపిఎస్ నిధులు రూ.1.54కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన 16 రోడ్డులు, డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ వేగుళ్ల శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టివి.రంగా రావు , మాజీ ఛైర్‌పర్సన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైస్ ఛైర్ పర్సన్ పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ళ నారాయణ రావు, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.శ్రీనివాస్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీరు డి.వి.పవన్ కుమార్, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట ఎస్ ఎస్ 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధి లో 11 కెవి మందపల్లి లైన్ ట్రీ కటింగ్ కొరకు నేడు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందనిందిగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. రాంబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. పనసలదొడ్డి, చిన్నగులపాలెం, పెద్దగులపాలెం , బోడిపాలెం, కేదార్లంక, మందపల్లి, ఏనుగుమహల్ ఎజి ల్ సప్లై, మందపల్లి, చినగుల్లపాలెం ఏరియా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు, రేపు యోగా పోటీల నిర్వహణ

ప్రజాశక్తి - అమలాపురం

యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా ఈనెల 13, 14వ తేదీలలో శుక్రవారం, శనివారం రెండు రోజులు ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు యోగా షెడ్యూ ల్ ప్రకారం యోగ పోటీలు నిర్వహిస్తారని ఆయుష్ వైద్యాధికారి కె.విజయ కుమారి తెలిపా రు. యోగా స్కిట్‌రోల్ ప్రతి వయస్సు నుండి ఒక సమూహానికి ప్లే నిర్వహిస్తారన్నారు. యోగా క్విజ్-ప్రతి వయస్సు నుంచి ఒక విజేతను ఎంపిక చేస్తారన్నారు. యోగా పోస్టర్ ప్రతి సమూహం నుంచి ఒక విజేత ఎంపిక చేస్తారన్నారు.యోగా షార్ట్ ఫిల్మ్ యోగా ఫోటోగ్రఫీ నిర్వహిస్తారని ఆమె తెలిపారు యోగా పట్ల ఆసక్తిగల యువతి యువకులు పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు.

విమాన ప్రమాదంలో మృతులకు సంతాపం

ప్రజాశక్తి - రామచంద్రపురం

అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన విమానం మేఘానియా ప్రాంతంలో కూలిపోవడంతో ప్రమాదంలో 241 మంది మృతి చెందడం పట్ల పిడిఎస్ యు విద్యార్థి సంఘం గురువారం ఒక ప్రకటలో సంతాపం వ్యక్తం చేసింది. మెడికల్ విద్యార్థులు ఇప్పటివరకు సుమారు 20 పైగా విద్యార్థులు ప్రాణాలను కోల్పోయారు. ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదం లో బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వేసవి సెలవులు అనంతరం గురువారం ప్రభుత్వ పాఠశాలలు, ప్రయివేటు విద్యాసంస్థలు అన్ని పున:ప్రారంభమయ్యాయి. అయితే గురువారం మంచి రోజు కాదన్నా సెంటిమెంట్ తో విద్యార్థులు నామమాత్రంగా హాజరయ్యారు. అదేవిధంగా పలు విద్యాసంస్థల్లో కేవలం ఇద్దరు ముగ్గురు విద్యార్థులే హాజరు కావడంతో పాఠశాలలన్నీ వెలవెలబోయాయి. అయితే పాఠశాలలకు అవసరమైన పుస్తకాలు సామగ్రి ఇప్పటికే చేరవేసేందుకు విద్యాశాఖ ప్రారంభించగా, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రంచాలంటూ పౌలు ప్రజాసంఘాలు, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- సామర్లకోట

ఏడాదిలో అన్ని రంగాల్లో అభివద్ధి సాధిస్తూ అభివృద్ధికి నిదర్శనంగా గా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట, పెద్దాపురంలో పలు అభివృద్ధి పనులను గురువారం డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి ఎంఎల్ఎ చినరాజప్ప ప్రారంభించారు. సామర్లకోట మండలంలోని పనసపాడు, పి.వేమవరంలో సిసి రోడ్లకు, సిసి డ్రైన్లను ప్రారభించారు. ఈ ఎంపిడిఒ కె.హిమ మహేశ్వరి పాల్గొన్నారు.

హైవేపై స్టాపర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - జగ్గంపేట

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా స్థానిక జెవియర్ జంక్షన్‌లో పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాన్ని పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు పరిశీలించారు. రాత్రి సమయాల్లో అతి వేగంతో హైవేపై వాహనాలు ప్రయాణిస్తూ రోడ్డు దాటుతున్న వారిని ఢీకొంటున్నాయని, వాటిని నివారించేందుకు రేడియం స్టిక్కర్లతో ట్రైర్లను ఏర్పాటు చేశామని డిఎస్‌పికి ఎస్ఐ రఘునాథరావు వివరించారు.

పురస్కార గ్రహీత రమ్యశ్రీకు అభినందన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


రమ్యశ్రీ కి ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఎన్.కొత్తపల్లి నల్లా వారి పేటకు చెందిన గోసంగి సురేష్ ,సునీత దంపతుల కుమార్తె రమ్యశ్రీ షైనింగ్ స్టార్ పురస్కారం అందుకోవడంపై ఆమెకు గురువారం పలువురు అభినందనలు తెలిపారు. రమ్యశ్రీ గొల్లవిల్లి సిఎస్ఎం జూనియర్ కళాశాలలో చదువుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి గ్రూపులో 971/1000 మార్కులు సాధించింది. ఆమె జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అత్యంత ప్రతిభ కనబరిచిన రమ్యశ్రీ ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ -2025 ప్రతిభా పురస్కారాలకు ఎంపికైంది. ఈ సందర్భంగా రమ్యశ్రీని కలెక్టర్ రావిలాల మహేష్ కుమార్ సత్కరించి, అభినందించి ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. తమ కళాశాలలో చదివిన రమ్యశ్రీ ప్రతిభ కనబరిచి అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆ కళాశాలలో గురువారం అభినందన సభ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పిన సిఎస్ఎం కళాశాల విద్యార్థి చదువులో ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యక్షులు డాక్టర్ చిక్కం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిక్కం వెంకటేశ్వర రాజేంద్రప్రసాద్, కోశాధికారి మోటూరి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ కంచుమర్తి బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ తోకల దుర్గా ఈశ్వరరావు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు రమ్యశ్రీని అభినందించారు.

బాధితులకు నిత్యావసరాల అందజేత

ప్రజాశక్తి - అంబాజీపేట


బాధితులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న వైసిపి శ్రేణులు

వాకలగరువు బుల్లి కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు వైసిపి శ్రేణులు సమకూర్చిన నిత్యావసర వస్తువులను నియోజకవర్గ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విత్తనాల ఇంద్రశేఖర్, పేరి శ్రీను, జడ్‌పిటిసి సభ్యురాలు బుడిద వరలక్ష్మి, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, మద్దింశెట్టి మల్లిబాబు, కాండ్రేగుల నాగబాబు, మట్టపర్తి హరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యామిత్ర కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల వ్యాప్తంగా ఉన్న 75 ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వెంకటాచలం దొంతుకురు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా మిత్ర కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మంచి అభివద్ధిలోకి రావాలని సూచించారు. ఈ కిట్లలో పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూస్ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 4862 మంది విద్యార్థులు విద్యను వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్నారని వారందరికీ విద్యా మిత్ర కిట్ల పంపిణీ చేస్తామని ఎంఇఒ వెంకటరమణ తెలిపారు. **ఆలమూరు:** మండలంలోని గుమ్మిలేరు ఎంపిపి యుపి స్కూల్ నందు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను గురువారం సర్పంచ్ గుణ్ణం రాంబాబు విద్యార్థులకు అందజేశారు. పంపిణీ చేసిన మిత్ర కిట్లను ఆయన పరిశీలించారు. అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు, బ్యాగులు, బెల్టులు సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉచితంగా అందిస్తున్న ఈ పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావా లని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమ ంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -మామిడికుదురు

ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని సర్వ శిక్ష సమగ్ర సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం సూచించారు. నగరం ప్రాథమిక పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు .కార్యక్రమంలో ఎంఇఒ- 2 మోకా వెంకన్న బాబు, హెచ్ఎం బావిసెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదపట్నంలో కేజ్ కల్చర్ పరిశీలన

ప్రజాశక్తి - మామిడికుదురు

పెదపట్నంలో గోదావరి ప్రాంతంలో ఉన్న కేజ్ కల్చర్ ను నాబార్డ్ డిడిఎం సోము నాయుడు గురువారం పరిశీలించారు రాబోయే రోజుల్లో చేపలను ఈ విధంగా పెంచడం వలన ఉపయోగాలుంటాయన్నారు. గోదావరి ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుందన్నారు. ఎఫ్‌పిఒ ఆధారంగా కేజ్ కల్చర్ మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ఎఫ్ పి ఒ మెంబ ర్షిప్ కూడా ప్రారంభమైందన్నారు. మెంబర్షిప్ తీసుకోవడం వలన భవిష్యత్తులో జరిగే నాబార్డ్ కార్యక్రమాల్లోనే మరియు ఫిష్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావచ్చని అన్నారు. కేజ్ కల్చర్ నిర్వహికులు లక్ష్మినారాయణ గోదావరి ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - మామిడికుదురు

దోమల నిర్మూలనతో సంపూర్ణమైన ఆరోగ్యము పొందవచ్చని హెల్త్ అసిస్టెంట్ కెవి. సూర్యనారాయణ సూచించారు పెదపట్నం లంకలో మలేరియా నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు ఇళ్ల వద్ద మురుగునీటి నిలవలు లేకుండా అందరూ బాధ్యతగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు దోమలు వల్ల ఎన్నో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఎన్ఎం పి.నాగమణి, టి.నాగమణి, ఎంఎల్‌హెచ్ పి.నాగదుర్గ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మేడిది సీత,ఆశా కార్యకర్తలు,ఉపాధిహామీ శ్రామికులు పాల్గొన్నారు

ఘనంగా కూటమి ప్రభుత్వ సంబరాలు


పి.గన్నవరంలో పాల్గొన్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ



రావులపాలెంలో విజయోత్సవ ర్యాలీలో ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పాలన ఏడాది పూర్తయిన కారణంగా గురువారం ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు ఘనంగా నిర్వహించారు.

పి.గన్నవరం: ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబిస్తుందని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో కూటమి శ్రేణులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. నగరం ఎఎంసి ఛైర్మన్ పెనుమాల లక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం రైతులకు మద్దతు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం ప్రతిభ కనపరిచిందన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డ్ కమిటీ ఎఎంసి ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ జీవనోపాధి లను మెరుగుపరచడంలో ప్రభుత్వం మెరుగైన పనితీరు కనబరిచిందన్నారు. నూతనంగా ఎన్నికైన ఎఎంసి ఛైర్మన్లను ఎంఎల్ఎ, కూటమి శ్రేణులు సన్మానించారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి శ్రేణులు పాల్గొన్నారు. **మండపేట:** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినసందర్భంగా మండపేట లో కూటమి శ్రేణులు విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు ఈ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **రావులపాలెం:** రాష్ట్రంలో ఏడాది పాలన పురష్కరించుకొని నియోజకవర్గ స్థాయిలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కెవి.సత్యనారాయణ రెడ్డి, ఈదల సత్తిబాబు, కొప్పిశెట్టి ప్రసాద్, కూసంపూడి రామకష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు, ఎఎంసి ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ ఆద్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, సర్పంచ్ జయ సావిత్రి, ప్రధాన కార్యదర్శి కుడుపూడి బుజ్జి, తోటకూర నాగజోగి వర్మ తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు**: కూటమి ప్రభుత్వము ఏర్పడి ఏడాదైన సందర్భంగా మామిడికుదురు సెంటర్లో కూటమి శ్రేణులు విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, యోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, నగరం ఎఎంసి ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుం దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు అర్ధాని శ్రీనివాస రావు ఆధ్వర్యంలో కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా జరిగిన సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కక్ను గుత్తుల సాయి కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, దొమ్మేటి రమణ కుమార్, గుద్దటి జమ్మి, పిల్లి నాగరాజు, నిమ్మకాయల చిన్న, చిక్కాల అంజిబాబు, మెండి కమల, మట్టపర్తి ఈశ్వరి, దాట్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.


ముమ్మిడివరం లో సుపరిపాలన సంబరాలు